తన ఓటమికి తొలిమెట్టుగా అనిపించి ఉక్రోషంగా కణతలు నొక్కుకున్నాడు.

ఒకవేళ నానీ బ్రతికివుంటే పదిరోజుల గడువులో రేయింబవళ్లూ శ్రమించయినా నానీని తీసుకురాగలడన్న నమ్మకం వుంది.

లేకపోతే....

బ్రతికి లేకపోయినా కీలకమైన సాక్ష్యాన్ని పరిమార్చిన నేరస్థుల్ని పట్టుకోగలడు.

అదికాదు ఆ క్షణంలో అతడ్ని అంతగా బాధిస్తున్నది.

మరి కొన్ని గంటల్లో తను ట్రాన్స్ఫర్ ఆర్డర్ అందుకోబోతున్నాడు.

దీని వెనుక బలమైన శక్తి ఏదన్నాగానీ తను డీల్ చేస్తున్న "కేసు ఫైలు" మరొకరికి అందజేయబడుతుంది.

పర్యవసానం ఎలా వున్నా కేవలం తన నిజాయితీ మూలంగా ఓ పసికందు ఆపదల్లో చిక్కుకున్నాడు.

జీవితంలో తొలిసారి ఇలాంటి అనుభవానికి గురికావడంతో సరాసరి స్టేషన్కి వెళ్లలేక పోయాడు.

తిన్నగా హరిత దగ్గరకు బయలుదేరాడు.

"వాటె సర్ప్రయిజ్ ఇటీజ్" అంటూ హుషారుగా రిసీవ్ చేసుకుంది.

"ఆ నడకేంటి?" నిస్త్రాణగా నడుస్తున్న యశస్విని అలా చూడడం తొలిసారి "నడుస్తున్నట్టు లేదు, ప్రాకుతున్నట్టుంది."

"అయామ్ నాటే స్నేక్" సోఫాలో కూర్చున్నాడు బడలికగా.

"అసలు పాముకీ, మగాడికి తేడా ఏమిటో తెలుసా?" అడిగింది అల్లరిగా.

"ఏంటట?"

" A Snake crawls on its belly shile a man crawls on any belly he finds vacent"

యశస్విలో చలనం లేదు.

"ఏమైంది నీకు? అరోజు సెక్షన్ 375 విషయంలో రెచ్చిపోయి చివరికి ఏదీ కాక ఆనక నిద్రపట్టడం మానేసిందా?.... చూడు యశస్వీ ఆడపిల్ల "లిబరల్" గా వున్నట్టు అనిపించగానే మగాడు "ప్రోగ్రెసివ్"గా దూసుకుపోవాలి. అప్పుడుకాని అది ఐడియల్ లౌ అనిపించుకోదు. అసలు టెన్సింగ్ ఎవరెస్టుమీద జండా పాతేశాడూ అంటే ఎంత శ్రద్ధపడ్డాడని అఫ్కోర్స్! ఎవరెస్టుకూడా చాలా సహకరించిందనుకో."

"హరితా! ఏ జోక్ని ఎంజాయ్ చేసే స్థితిలో లేను. చాలా స్వల్పకాలంలో నీకు దూరం కాబోతున్నాను."

“వ్వాట్?” విడ్డూరంగా చూసింది. “ఏం జరిగింది?” ఒక్కసారిగా సీరియసైపోయి అతడి తలను తనవైపు తిప్పుకున్నది.

క్లుప్తంగా చెప్పేశాడు. ఓ కేసులో తలదూర్చిన తను లోతుగా వెళుతుంటే ట్రాన్స్ఫర్ చేయబడుతున్నట్టు.

ఆవేశంగా లేచింది.

ఫ్యాక్టరీకి ఫోన్‌చేసి అర్జంటుగా రమ్మని పాండురంగారావుగారిని పిలిచింది.

సామాన్యంగా ఫ్యాక్టరీకి ఏనాడు ఫోన్ చేయని కూతురు ఎందుకింత హడావుడి చేస్తూందీ అర్థంకాని పాండురంగారావు పది నిముషాలలో ఇంటికొచ్చేశారు.

యశస్వి నిశ్శబ్దంగానే ఉన్నాడు.

హరిత అంతా చెప్పింది “డాడీ! మనిషికి ఆపదొస్తే రక్షించాల్సిన పోలీస్ డిపార్టుమెంటులోని ఓ నిజాయితీగల పోలీసాఫీసర్ ఇలాంటి స్థితికి చేరుకున్నందుకు నేను ఆశ్చర్యపోవడంలేదు, క్రూరమృగాలను వేటాడి ఈ జనారణ్యాన్ని కాపాడాలనుకునే ఒక్క మనిషికి న్యాయం జరిగినా చాలు. అది మా వ్యవస్థ చేసుకున్న అదృష్టంగా భావించిన నేను మిమ్మల్ని అర్థిస్తున్న దొక్కటే... ఏ పలుకుబడితో యశస్విని ఇక్కడ నుంచి లేపేయాలని చూస్తున్నారో అలాంటి ఇన్‌ఫ్లూయన్స్ మీరుపయోగించాలి. ట్రాన్స్ఫర్ ఆపాలి. అంతే....!”

ఎప్పుడూ ఆకతాయిగా మాట్లాడే హరితలోని ఆవేశం, యశస్విని దూరం చేసుకోలేని ఉక్రోషాన్ని గమనించిన పాండురంగారావు వ్యక్తిగతంగా తాను పలుకుబడిగల వ్యక్తి కాబట్టి వెంటనే వైజాగ్ ఫోన్ చేశాడు.

మరో అరగంటలో బోధపడిపోయింది.

ఈ నిర్ణయం యస్పీది కాదని, జిల్లాపరిషత్ చైర్మన్ రాష్ట్ర హోం మినిస్టర్‌ని ఇన్‌ఫ్లూయన్స్ చేసి ఇదంతా చేయించాడని.....

పాండురంగారావుగారు నిస్సహాయతని ప్రకటించిన మరుక్షణం ఎక్కువగా ఉద్రేకపడింది హరిత.

“యశస్వీ” సాలోచనగా చూస్తూ అంది “ఇక న్యాయాన్ని రక్షించడమే మనిషి ధ్యేయమైనపుడు దానికి పోలీసాఫీసర్ కానక్కరలేదు. నిజాయితీగల యీ దేశ పౌరుడైతే చాలు.”

సరిగ్గా ఆ వాక్యమే యశస్విని తట్టి లేపింది.

వెంటనే స్టేషన్‌కి బయలుదేరాడు.

“సర్!” రఘునాథరావు ముందు సెల్యూట్ చేసి నిలబడ్డ యశస్విని రెప్పలార్చకుండా చూశారాయన.

అప్పటికే ఎడ్జార్న్‌మెంట్ గురించి తెలిసింది. ఇపుడు అతడు అయిష్టంగా ఎదురు

చూస్తున్నాడు రాబోతున్న ట్రాన్స్‌ఫరార్డరు గురించి. "యస్"

"మీ అనుభవం ముందు నేను చాలా చిన్న వాణ్ణి, నేను ఒక న్యాయం కోసం నిలబడే మనిషినని మీరొక్కడు అంగీకరిస్తే చాలు."

"ఐ హేవ్ గాట్ సఫిసియంట్ బిలీఫ్ ఇన్ యూ."

"మరి కొన్ని గంటల్లో నేను ట్రాన్స్‌ఫర్ ఆర్డరు తీసుకుని తీరాలి"

"అఫ్‌కోర్స్...." వెనుక ఎలాంటి బలమైన శక్తి వున్నదీ అప్పటికే ఆయన గ్రహించేశారు.

"నో...." ఓ క్షణం ఆగాడు "మీరు నాకు ఓ పది రోజులు శెలవు గ్రాంటు చేయండి."

"దేనికి?"

"నేను కోర్టులో గడువు కోరింది పది రోజులే కాబట్టి...."

"దాని వలన ఉపయోగం?"

"ప్రస్తుతానికి నేను ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ తీసుకోవాల్సిన అగత్యం ఉండదు, ఫైల్ నా ఆధీనంలోనే వుంటుంది."

"కాని...." ఏం ఆశించి యశస్వి ఇదంతా మాట్లాడుతున్నదీ ఆయనకి అర్థం కాలేదు "నువ్వు శలవులో ఉన్నంత మాత్రాన ఈ కేసు నెలా డీల్ చెయ్యగలననుకుంటున్నావు?"

"ఒక బాధ్యత గల పౌరుడిగా"

"క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 43 ప్రకారం కాగ్నిజబుల్ అఫెన్స్ చేసిన ఏ పౌరుడినైనా అరెస్ట్ చేసే హక్కు మరో సామాన్య పౌరుడికి వుందని మన చట్టం నిర్దేశించిన న్యాయమే కాబట్టి నేను ఒక పౌరుడిగా ఈ కేస్ డీల్ చేస్తాను."

ఆ క్షణాన డిపార్ట్‌మెంట్ గర్వించదగ్గ నిజమయిన పోలీసాఫీసర్‌ను చూస్తున్నాడాయన.

"సర్! వేయి మాఫియా గేంగుల్ని పట్టి బంధించడంకన్నా ఒక పోలీసాఫీసర్‌గా ఒక్క నానీని నేను దక్కించుకుంటే చాలు. ఈ దేశానికి ఓ ఐన్‌స్టీన్నో లేక శంకరాచార్యనో మిగిల్చినవాడినవుతాను."

బాధగా తల వంచుకున్నాడు "అసలు నానీకేమన్నా జరిగితే దానికి పూర్తి భాధ్యుడిని నేనే అన్న ఆలోచన నన్నెంత కలవరపెడుతున్నదీ మీరు ఊహించలేరు."

రఘునాధరావు యశస్విని సమీపించి ఆప్యాయంగా భుజాలపై చేతులు వేశాడు.

"ప్రొసీడ్.... మై బ్లెస్సింగ్స్ ఆర్ విత్ యూ. కమాన్! వెంటనే లీవ్ అప్లయ్ చేయండి."

మరో అయిదు నిముషాల్లో అన్ని పనులూ చకచకా పూర్తి అయిపోయాయి.

టైం చూసుకున్నాడు. ఇంకా మిగిలింది తొమ్మిదిన్నర రోజుల గడువు.

యశస్వి కదిలాడు తన పోరాటపు తొలి ఘట్టానికి సమాయత్తమవుతూ.....

** ** ** **

"అనేన పాదసేన

ప్రసుప్తశ్య మమ

శిఖం అగ్రమ్య
ఖడ్గేణనోపహత:"

శ్లోకాన్ని చెప్పిన మన్మధరావు ఓ క్షణం ఆగి "శ్లోకంలోని ప్రతి పాదపు మొదటి అక్షరం కలిపితే అప్రశిఖ అవుతుంది" అన్నాడు చెట్టుకి చేరిగిలబడి తననే గమనిస్తున్న రతిని చూస్తూ-

"గుడ్" అభినందించింది రతి "ఇంత స్వల్ప వ్యవధిలో ఈ జవాబు నెలా సాధించావు మనూ"

తనతో తీసుకొచ్చిన నానీని చూపించాడు ఎలాంటి భేషజమూ లేకుండా.

అబ్బురంగా నానీని దగ్గరకు తీసుకుని "ఈ చిన్ని వయసులో ఇలాంటి శ్లోకాన్ని ఎలా కంఠస్తం చేయగలిగావు" అడిగింది విస్మయంగా.

"తాతయ్య చెప్పాడు ఇదే కాదు నర్సరీ రైమ్సన్నా సరే టీచరు ఒక్కసారి చెప్పగానే వచ్చేస్తుంది నాకు."

"అంటే జగన్నాధరాయుల వంశం వాడివేమో...."

"కాదు.... మా తాతయ్య విశ్వేశ్వరశాస్త్రి మనవడనన్న మాట."

"మరి అర్థం కూడా తెలుసా?"

"పూర్తిగా తెలీదు కాని ఆ కథ తెలుసు. ఎందుకంటే తాతయ్య కథలాగే ఎవరికో చెబుతుంటే విన్నాననన్నమాట."

"నువ్వు చెప్పగలవన్న మాట" అంది.

'ఓ' గర్వంగా ఓ సారి తాతయ్యని గుర్తు చేసుకున్నాడు "ఇద్దరు మంచి ఫ్రెండ్సన్న మాట. ఒక ఊరికి చెందినవాళ్ళు. ఒకడు బాగా తెలివితో ఎన్నో బహుమతులు గెల్చుకుని ఒక్క బహుమతీ రాని తెలివితక్కువ స్నేహితుడితో వూరికొస్తున్నారట. అప్పుడేమో తోవలో ఓ అడివొస్తే తెలివయిన ఫ్రెండున్నాడుగా ఆయన నిద్రపోయాడు. అసూయతో రెండోవాడు ఆయన్ను చంపి బహుమతులన్నీ తీసుకుని ఊరొచ్చేస్తాడు. చచ్చిపోయిన వాడి నాన్నంటాడుగా.... అతనితో మరేమో మీ అబ్బాయిని సింహం చంపేసిందీ అని అబద్దం కూడా చెబితే ఆయన అసలు నమ్మలేదన్న మాట.... పోనీ చచ్చిపోయేటప్పుడు ఏమన్నా అన్నాడా అంటే 'అప్రశిఖ' అన్నాడూ అని చెప్పాడట.
భోజరాజుకి ఫిర్యాదు చేస్తే ఆ పదానికి ఎవరూ అర్థం చెప్పకపోతే అప్పుడు కాళిదాసు లేడూ! ఆయనట పెద్ద కవన్న మాటా.... ఆయన్ని అడిగాడట. ఆయన దేవీ భక్తుడుగా, ఆలోచించి చెప్పాడట ఈ శ్లోకాన్ని" ఓ క్షణం ఆగాడు అలుపు తీర్చుకోడానికన్నట్లుగా "నాకు శ్లోకమంతటికీ అర్థం తెలీదుగాని తనను స్నేహితుడిలా చంపాడని అందులో ఉందట"

"వెరీగుడ్" నానీని ముద్దు కూడా పెట్టుకుంది.

మన్మధరావుని చూస్తూ "నేనడిగిన సమస్యకి అర్థం తెలుసుకోవడానికి నువ్వెంత

మధనపడి వుంటావో వూహించగలను మనూ! నాకు చిన్నప్పటినుంచి నిన్ను ఆట పట్టించడమంటే ఇష్టం. అందుకే నువ్వంటే నాకు చాలా ఇష్టం" అంది అప్పటిలాగే.

ఆ చెప్పడంలో ఎలాంటి భావుకతా లేదు. ఉద్రేకం లేదు.

"థేంక్యూ రతీ! మారిపోయావనుకున్నాను."

"ఎందుకనుకున్నావు?"

"నువ్వెక్కడ? నేనెక్కడ?"

"స్నేహానికి, ఇష్టానికి ఈ అంతస్థులేమిటి?"

ఆ మాటలు వింటుంటే దాగలేనమ్మా అంటూ స్మృతుల నీటిపొర అతడి కళ్ళల్లో పేరుకుపోయింది.

"ఎలా మరిచిపోగలను మన్మధరావ్! మనం తిరిగిన ఈ ప్రదేశాలనీ, మనల్ని పలకరించే ఈ చెట్లనీ, చేమల్నీ ఎప్పటికీ మరిచిపోలేను....

నిన్నూ అంతే."

"అంటే" ఒక చిన్న అపశృతి ధ్వనించిందామె పదజాలంలో "నేను..నేను అంతకుమించి ఏమీ కానా రతీ?" కంపించిపోతూ అడిగాడు....

"ఏమౌతావు మనూ! అని మాట్లాడలేవు. నువ్వు మనసులోనిది చెప్పగలవు. అరె! ఎందుకలా అయిపోతున్నావు. నీకు తెలుసుగా నేను చాలా ప్రాక్టికల్ గా అలోచిస్తానని." దోసిలిలోని పూలు దేవత పాదాలపై నైవేద్యంగా అర్పించకముందే పెనుగాలి కెగిరి నేలపై పడినట్లు ఆందోళన పడిపోతున్నాడు."నువ్వు.... నువ్వింకా ఆట పట్టిస్తున్నావు కదూ!"

"నీ దగ్గర నాకా చనువుంది మనూ! నిన్ను జీవితాంతం ఆట పట్టించగలను. అది నా కేరెక్టర్."